సాక్షి నారాయణపేట

ఆదివారం । 28 । జూలై । 2024



3.10 లక్షల ఇన్‌ఫ్లో

ఎగువన కురుస్తున్న వర్షాలతో జూరాలకు 3.10 లక్షల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది.

వివరాలు 10లో ▸



జాతీయ హోదాకు ఉద్యమం

'పాలమూరు'కు జాతీయ హోదా కోసం ఉద్యమిద్దామని చాడ వెంకట్‌రెడ్డి అన్నారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
29.7/24.3

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అప్పుడప్పుడు చిరు జల్లులతో పాటు ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

కర్వెన నుంచి నీటి తరలింపు..

కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్ కెపాసిటీ పెంచితే పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల్లో భాగంగా భూత్పూరు మండలంలో నిర్మిస్తున్న కర్వెన రిజర్వాయర్‌ను నీటివనరుగా ఎంచుకున్నారు. ఈ రిజర్వాయర్ నుంచి నారాయణపేటకు వెళ్లే కాల్వ ద్వారా నీటిని తీసుకుని.. కోయిల్‌సాగర్‌కు వెనుక నుంచి వచ్చే వాగులో కలిపితే ప్రాజెక్ట్‌లోకి నీరు నేరుగా వచ్చే అవకాశం ఉందని ప్రతిపాదించారు. అంతేకాకుండా కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్‌ను ఎప్పటికీ నీటితో నిండుగా ఉండేలా చేస్తే సాగు, తాగునీటి అవసరాలకు **ఇబ్బంది లేకుండా ఉంటుందని ఇంజినీరింగ్ అధికారులు సూచించారు.**

50,250 ఎకరాలు లక్ష్యంగా..

కోయిల్‌సాగర్ కుడి, ఎడమ కాల్వలు.. ఉంద్యాల, తీలేర్ పంప్‌హౌస్ వద్ద ఉన్న రెండు లింక్ కెనాళ్ల ద్వారా వానాకాలం (ఖరీఫ్)లో 35,600 ఎకరాలకు, ఎండాకాలంలో 12 వేల ఎకరాలకు సాగునీరందుతున్నట్లు అంచనా. దేవరకద్ర గ్రావిటీ కెనాల్ ద్వారా మరో 5,500 ఎకరాలు, కౌకుంట్ల, రాజోలి నుంచి ఎడమ కాల్వ పొడిగింపు ద్వారా మరో ఎనిమిది వేల ఎకరాలకు సాగు నీరు అందించాల్సి ఉంది. దేవరకద్ర గ్రావిటీ కెనాల్ పనులు 90 శాతం పూర్తి కాగా.. చివరి దశలో ఉన్నాయి. ఎడమ కాల్వ పొడిగింపు పనులు భూ సేకరణ కారణంగా ప్రారంభం కాలేదు. ప్రస్తుతం బడ్జెట్‌లో రూ.187.95 కోట్లు కేటాయించడంతో పెండింగ్ పనులు ఊపందుకోనున్నాయి. మరోవైపు ప్రాజెక్ట్ ఎత్తు పెంపుతో కోయిల్‌సాగర్ ఎత్తిపోతల లక్ష్యం **50,250 ఎకరాలకు చేరే అవకాశం ఉన్నట్లు ఇంజినీరింగ్ అధికారులు భావిస్తున్నారు.**

'కోయిల్‌సాగర్'పై కసరత్తు

ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యం పెంచేలా ప్రణాళికలు

- **కర్వెన నుంచి కృష్ణా నీటిని కాల్వ ద్వారా తరలించేలా ప్లాన్**
- ప్రభుత్వానికి రెండు ప్రతిపాదనలు పంపిన ఇంజినీరింగ్ అధికారులు
- 3.5 టీఎంసీలకు పెంచితే 2 గ్రామాలకు ముంపు ముప్పు
- 5 టీఎంసీల వరకు పెంచితే 5 పల్లెలు కనుమరుగు



ముంపునకు గురయ్యే గ్రామాలు..

అదనంగా టీఎంసీ నిల్వ సామర్థ్యంపెంచితే..: అంకిళ్ల, ఇబ్రహీంనగర్ (కోయిల్‌కొండ)

అదనంగా 2.50 టీఎంసీల నిల్వ సామర్థ్యం పెంచితే: అంకిళ్ల, ఇబ్రహీంనగర్, పెద్దతండా, అయ్యవారిపల్లి (కోయిల్‌కొండ), బొల్లోని తండా (దేవరకద్ర)

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రతి ఎకరాకు సాగు నీరందించాలనే లక్ష్యం దిశగా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలు, మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్, భీమా, సంగంబండ, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్‌లకు బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. అంతేకాదు ఒక్కో ప్రాజెక్ట్‌పై ప్రత్యేక దృష్టి సారించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత ప్రజాప్రతినిధులు, ఇంజినీరింగ్ అధికారులతో క్రమంతప్పకుండా సమీక్షిస్తూ.. నిశితంగా పరిశీలిస్తూ ముందుకు సాగుతున్నారు. ప్రాజెక్ట్ పరిధిలో చివరి ఆయకట్టు వరకు నీరందించాలనే దృక్పథంతో అవసరమైతే రిజర్వాయర్ల నీటి నిల్వ సామర్థ్యం పెంపు దిశగా సన్నాహాలు మొదలెట్టారు. ఇందులో భాగంగా కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యం పెంపునకు అడుగులు పడినట్లు తెలుస్తోంది. సీఎం ఆదేశాల మేరకు సర్వే చేసిన ఇంజినీరింగ్ అధికారులు రెండు ప్రతిపాదనలతో కూడిన నివేదికను ప్రభుత్వానికి అందజేశారు.

కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్‌ను 1.5 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో 1947లో నిర్మాణ పనులు ప్రారంభించారు. 1956లో పనులు పూర్తి కాగా.. ఆయకట్టులో ఎనిమిది వేల ఎకరాలకు సాగు నీరందించారు. ఆ తర్వాత ఈ ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యాన్ని 2.5 టీఎంసీలకు పెంచారు. ఉమ్మడి రాష్ట్రంలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞంలో భాగంగా 2006లో రూ.249 కోట్ల వ్యయంతో కోయిల్ సాగర్ ఎత్తిపోతలకు

3.5 లేదంటే 5 టీఎంసీల వరకు పెంచేలా..

శ్రీకారం చుట్టారు. ఆయన మరణాంతరం పనులు మందగించాయి. తాజాగా కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యాన్ని 3.50 లేదా ఐదు టీఎంసీలకు పెంచాలని ప్రతిపాదించారు. అయితే నారాయణపేట జిల్లా కోయిల్‌కొండ మండలంలోని రెండు గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. అదేవిధంగా ప్రాజెక్ట్ కెపాసిటీని ఐదు టీంఎసీలకు పెంచాలని రెండో ప్రతిపాదన చేశారు. దీంతో మొత్తం కోయిల్‌కొండ మండలంలోని నాలుగు గ్రామాలు, దేవరకద్ర మండలంలోని ఒక గ్రామం ముంపునకు గురవుతుందని గుర్తించినట్లు నివేదికలో పేర్కొన్నారు.

మోక్షం లభిస్తుందా..

కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్ సామర్థ్యాన్ని ఏడు టీఎంసీలకు పెంచాలని సైతం ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదించినట్లు సమాచారం. చాలా గ్రామాలు ముంపునకు గురవుతున్న క్రమంలో ఆ ప్రతిపాదనను విరమించుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షించిన సందర్భంలో ముంపు ప్రాంతాలు లేకుండా ప్రాజెక్ట్‌ల సామర్థ్యం పెంపును పరిశీలించాలని సూచించారు. ఈ నేపథ్యంలో కోయిల్‌సాగర్ సామర్థ్యం పెంపుపై అధికారుల ప్రతిపాదనలకు మోక్షం లభిస్తుందా.. లేదా అనేది వేచి చూడాల్సిందే.

ప్రతిపాదనలను ప్రభుత్వానికి అందజేశాం..

కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్ ఎత్తు పెంపునకు సంబంధించి రెండు ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించాం. కర్వెన రిజర్వాయర్ నుంచి కోయిల్‌సాగర్‌కు నీరందించేలా పథకానికి రూపకల్పన చేశాం. ప్రాజెక్ట్ ఎత్తు పెంచడం వల్ల మొదటి ప్రతిపాదనలో 2, రెండో ప్రతిపాదనలో 5 గ్రామాలు ముంపునకు గురవుతాయి. 50వేల ఎకరాల సాగు లక్ష్యం నేరవేరుతుంది. రెండు ప్రతిపాదనల్లో ఇంకా ఏది ఖరారు కాలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నడుచుకుంటాం.

– ప్రతాప్‌సింగ్, ఈఈ, కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్

వరాల జల్లు కురిసేనా..



సీఎం సభాస్థలాన్ని పరిశీలిస్తున్న ఐజీ సత్యనారాయణ, ఎస్పీ వైభవ్ గైక్వాడ్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, తదితరులు

నేడు కల్వకుర్తిలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

- ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి సొంతగడ్డకు..
- కల్వకుర్తిలో మాజీ కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణ
- అనంతరం బహిరంగసభలో ప్రసంగించనున్న సీఎం
- అభివృద్ధి పనులు, నిధుల మంజూరుపై ఆశలు



జనసమీకరణలో నేతలు

సీఎం బహిరంగసభ ఆదివారం సాయంత్రం 4 గంటలకు కల్వకుర్తిలోని మున్సిపల్ కార్యాలయం పక్కన బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ మైదానంలో జరగనుంది. ఈ నేపథ్యంలో ఇక్కడి నాయకులు జనసమీకరణపై దృష్టిపెట్టారు. నియోజకవర్గంలోని పలు మండలాలతో పాటుగా ఇతర ప్రాంతాల నుంచి ప్రజలను సైతం సీఎం సభకు వచ్చేలా నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పార్కింగ్ విషయంలో సభకు వచ్చే వాహనాలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రాంతాల్లోనే ఆపాలని పోలీసులు సూచనలు చేస్తున్నారు.

సాక్షి, నాగర్‌కర్నూల్/ కల్వకుర్తి: జిల్లాలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించనున్నారు. కల్వకుర్తి పట్టణ శివారులోని కొత్త చౌరస్తాలో కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమీపంలో నిర్వహించనున్న బహిరంగ సభకు హాజరై మాట్లాడుతారు. అయితే సీఎం హోదాలో తొలిసారిగా సొంతగడ్డకు వస్తుండటంతో ఆయన పర్యటనపై జిల్లావాసుల్లో ఆశలు నెలకొన్నాయి. తొలిసారి జిల్లాకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్తున్న సందర్భంగా ఈ ప్రాంత అభివృద్ధికి పెద్దమొత్తంలో వరాలు కురిపిస్తారన్న అంచనాలు ఉన్నాయి.

నల్లమల ప్రాంత అభివృద్ధి..

నల్లమల బిడ్డగా ముఖ్యమంత్రిగా ఎదిగిన రేవంత్‌రెడ్డి ఈ ప్రాంత అభివృద్ధికి కృషిచేస్తానని పలుమార్లు ప్రకటించారు. ఈ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు పరిశ్రమలను ఏర్పాటు చేయాలన్న డిమాండ్ జిల్లావాసుల్లో వ్యక్తమవుతోంది. జిల్లాలో ప్రభుత్వ ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఏళ్లుగా వినిపిస్తోంది. జిల్లాకేంద్రంలో ఇప్పటికే మెడికల్ కళాశాల ఏర్పాటు కాగా.. జనరల్ ఆస్పత్రిలో ఆ స్థాయి సౌకర్యాలు, వసతులు ఇంకా మెరుగుపడలేదు. జనరల్ ఆస్పత్రిని 650 పడకలుగా తీర్చిదిద్ది, వైద్యులు, స్పెషాలిటీ వైద్యం అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది. అలాగే జిల్లావ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల్లో గాయాలపాలవుతున్న క్షతగాత్రులకు తక్షణ వైద్యసేవలు అందించేందుకు ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతవాసులకు ప్రయోజనం కలగనుంది. నల్లమల ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసి ఈ ప్రాంతవాసులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెబుతుండగా.. ఈ దిశగా ప్రతిపాదనలు సిద్ధం చేసి నిధులు మంజూరు చేయాల్సి ఉంది. జిల్లాలోని మున్సిపాలిటీల్లో రోడ్ల విస్తరణ, డ్రైయినేజీల నిర్మాణానికి అదనపు నిధులు మంజూరు చేస్తారని భావిస్తున్నారు. జిల్లాలోని గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులు మంజూరవుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కల్వకుర్తికి కూతవేటు దూరంలో ఉన్న ముఖ్యమంత్రి సొంత గ్రామం కొండారెడ్డిపల్లికి సైతం వరాలను కురిపిస్తాడని అక్కడి ప్రజలు ఆశిస్తున్నారు.

బందోబస్తు పరిశీలించిన ఐజీ

సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంలో పోలీసులు ఎక్కడా, ఎలాంటి సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు ఐజీ సత్యనారాయణ బందోబస్తును స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎస్పీ వైభవ్ గైక్వాడ్, ఇతర పోలీస్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. సీఎం పర్యటన కొనసాగే ప్రాంతాలన్నింటిని బాంబు స్క్వాడ్, ఇతర పోలీస్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు.

■ సీఎం పర్యటన కొనసాగే ప్రాంతాల్లో అధికారులు పూలమొక్కలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. కొత్త చౌరస్తా నుంచి ఒక కిలోమీటర్ పొడవునా పచ్చదనం వెదజల్లేలా మొక్కలను నాటాలని కలెక్టర్ సంతోష్ ఇప్పటికే అధికారులు ఆదేశాలు జారీ చేశారు. చౌరస్తాలో విగ్రహం చుట్టూ, విగ్రహం ఏర్పాటు చేసే ప్రాంగణంలో పచ్చదనం కనిపించేలా తీర్చిదిద్దడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా సుందరీకరణ పనులు చేపట్టారు.

న్యూస్‌రీల్

గురుకులాల్లో మౌలిక వసతులు కల్పించండి



నారాయణపేట: జిల్లా కేంద్రంలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల బాలుర, మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాల బాలురను జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి ఎంఏ రషీద్ శనివారం ఆకస్మికంగా సందర్శించి పలు సమస్యలపై చర్చించారు. పాఠశాల, కళాశాలలో తరగతులను వేర్వేరుగా పరిశీలించి విద్యకు సంబంధించి విద్యార్థుల నుంచి సమాచారం తెలుసుకున్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు పేరు తెచ్చిపెట్టాలన్నారు. పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి వివరాలు తెలుసుకున్నారు. అలాగే వారికి అవసరమైన సూచనలు ఇచ్చారు. అనంతరం పాఠశాల, కళాశాలలోని వంట గదులు, గోదాములను పరిశీలించి వార్డెన్‌కు అవసరమైన సూచనలు చేశారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పాఠశాల, కళాశాల పరిసరాల్లో పరిశుభ్రత పాటించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రిన్సిపల్స్ ఖవాజా మెహబూబ్ ఖాన్, జగదీష్ రెడ్డి, వార్డెన్‌లు ఉన్నారు.

'పేట' మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సదాశివరెడ్డి..?



నారాయణపేట రూరల్: నారాయణపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మండలంలోని జలాల్‌పూర్‌కు చెందిన రాంపురం సదాశివ రెడ్డిని నియమించే అవకాశం ఉంది. ఈ మేరకు కాంగ్రెస్ అధిష్టానం ఆయన పేరును ఫైనల్ చేసినట్లు తెలిసింది. గతంలో ఈయన గ్రామ సర్పంచ్‌గా, ఎంపీపీగా పనిచేశారు. కష్టకాలంలోనూ కాంగ్రెస్ పార్టీని వీడకుండా మండల అధ్యక్షుడిగా పనిచేస్తూ కార్యకర్తలకు అండగా ఉండటంతో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి ఆయనకు మద్దతు ఇచ్చినట్లు తెలుస్తోంది. మంగళవారం అధికారికంగా ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉంది.

భూసేకరణ పనులు పూర్తి చేయాలి



ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: భూసేకరణ కార్యాలయ అధికారులు, నీటి పారుదల శాఖ అధికారులు సమన్వయంతో జిల్లాలో భూసేకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శనివారం కలెక్టర్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులపై ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. రాజీవ్ బీమా ఎత్తిపోతల పథకం –1 కింద 82.35 ఎకరాల భూసేకరణకు సంబంధించిన డబ్బులు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నారాయణపేట పరిధిలో ఉన్నాయని, ప్రస్తుతం ఆ ప్రక్రియ ఎంత వరకు వచ్చిందని అడిగి తెలుసుకున్నారు. మిగతా పెండింగ్‌లో ఉన్న భూసేకరణను వేగిరం చేయాలన్నారు. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు సంబంధించిన పునరావాస కేంద్రాల ప్రాంతాలైన మక్తల్ మండలంలోని అనుగొండలో భూసేకరణ ఎంతవరకు పూర్తయిందని, ఇప్పుడు అక్కడ జరుగుతున్న ప్లాంటింగ్ పనులు ఏ దశలో ఉన్నాయని ఆరా తీశారు. అనుగొండ అనుబంధ గ్రామాలైన అంకెన్‌పల్లి, దాదన్‌పల్లి భూసేకరణకు సంబందించిన పనులు డిక్లరేషన్ ఆఫ్ నోటిఫికేషన్ (డీఎన్) దశలో ఉన్నాయని అధికారులు కలెక్టర్‌కు వివరించడంతో త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కాగా పునరావాస గ్రామల్లో ఇళ్లు కట్టుకున్న వాళ్లకే డబ్బులు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. భూసేకరణకు సంబంధించిన దస్త్రాలు (ఫైల్స్) అన్నింటినీ జాగ్రత్తగా భద్రపర్చాలని అధికారులను కలెక్టర్ ఆదేశించగా, రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ స్పందిస్తూ భూసేకరణ కార్యాలయం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఉండేదని, నారాయణపేట జిల్లాగా ఏర్పడిన తర్వాత ఇక్కడికి మార్చడం జరిగిందని కలెక్టర్‌కు తెలిపారు. సమీక్షలో నీటిపారుదల శాఖ డీ ఎస్ ఈ బాలరాజు, నారాయణ పేట, మక్తల్ ఈఈలు బ్రహ్మానంద, సంజీవప్రసాద్ పాల్గొన్నారు.

ఆస్పత్రులలో మందులు అందుబాటులో ఉంచాలి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పనితీరుపై కలెక్టర్ సమీక్ష జరిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వైద్య సేవలను పర్యవేక్షించాలని సూచించారు. అన్ని పిహెచ్‌సీ, యూహెచ్‌సీ, సివిల్ ఆసుపత్రులలో అవసరమైన మందులను అందుబాటులో ఉంచే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్, ట్రైని కలెక్టర్ గారిమా నరుల, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సౌభాగ్య లక్ష్మి, రంజిత్ కుమార్, డిఈఓ అబ్దుల్ ఘని పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతితోనే దేశ పురోగతి

నారాయణపేట: స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని, మహిళా అభ్యున్నతితోనే దేశ పురోగతి సాధ్యమని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శనివారం సింగారం చౌరస్తాలోని స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లో నిర్వహించిన జిల్లా మహిళా సమాఖ్య ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై మాట్లాడారు. నూతన టెక్నాలజీతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జించే విధంగా వారికి శిక్షణ ఇప్పించాలని అధికారులకు సూచించారు. మహిళా ఎంటర్ ప్రైజెస్ సంబందించి ఏ విధంగా వ్యాపారాలు నిర్వహిస్తునారని లబ్ధిదారుల నుంచి వివరాలను తెలుసుకొని వారిని అభినందించారు. మహిళాశక్తికి సంబంధించి అన్ని కార్యక్రమాలను సమగ్రమైన సమాచారాన్ని గ్రామీణ స్థాయి వరకు ఇచ్చి ఎంసిపిలు తయారు చేసుకొని పారదర్శకంగా అమలు జరిగేలా సిబ్బంది పని చేయాలని ఆదేశించారు.

స్వయం ఉపాధితో ఆర్థికంగా నిలదొక్కుకోవాలి

కలెక్టరేట్ మహిళా క్యాంటీన్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సమాఖ్య సభ్యులకు సూచించారు. గ్రామాల వారిగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా చేసిన నిర్మాణ పనుల పై కలెక్టర్ మహిళా సభ్యులను అడిగి తెలుసుకున్నారు. స్కూల్ పనులు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చూసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణ మండల మహిళతో కలెక్టర్ మాట్లాడుతూ పచ్చళ్ల వ్యాపారంలో ఎంత లాభం వచ్చిందని అడిగారు. దానికి మహిళా సమాధానం ఇస్తూ పచ్చళ్ల వ్యాపారంతో తాను ఆర్థికంగా నిలదొక్కుకున్నానని తెలిపారు. దీంతో కలెక్టర్ సంతృప్తిని వ్యక్తం చేశారు. మీ సేవ సెంటర్ కావాలని మక్తల్ సమాఖ్య మహిళ కోరారు. రూ. 262 కోట్ల సంవత్సరం టార్గెట్ కాగా కొన్నిచోట్ల ఎన్పీఏ ఉంది అన్నారు. బ్యాంకు లింకేజీ 21 శాతం ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ దానిని 50శాతం వరకు పెంచాలన్నారు. ఫామ్ యూనిట్స్, క్యాటిల్ ఫీల్డ్, ఎంటర్‌ప్రైజెస్ తదితర అంశాలపై చర్చించారు. డిఆర్‌డిఓ రాజేశ్వరి, అంజయ్య, డీపీఎంలు, ఏపీఎంలు, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయం



ఉపాధ్యాయులకు సభ్యత్వ నమోదు పత్రాలు అందజేస్తున్న హర్షవర్ధన్‌రెడ్డి

మరికల్: రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సంక్షేమం కోసమే పీఆర్‌టీయూ టీజీ పని చేస్తుందని ఆ సంఘం వ్యవస్థాపకుడు జీ. హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మరికల్ బాలుర ఉన్నత పాఠశాల్లో శనివారం పీఆర్‌టీయూ టీజీ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యల సాధన కోసం ఉపాధ్యాయ పదవికి రాజీనామా చేసి 2011లో పీఆర్‌టీయూ టీజీ సంఘం స్థాపించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే బదిలీలు, పదోన్నతులు కల్పించడం తమ సంఘం పాత్ర ఎంతో ఉందన్నారు. ఉపాధ్యాయుల స్థానికతకు వ్యతిరేకంగా గత ప్రభుత్వం జీవో 317 అమలు చేసిన రోజే ఆ పత్రాలను కాల్చివేసి నిరసన వ్యక్తం చేశామన్నారు. ఈ జీవోను రద్దు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. వచ్చే దసరాకు ఉపాధ్యాయులకు మొదటి డీఏ అమలు చేయిస్తామన్నారు. రాష్ట్రంలో పీఆర్‌టీయూ టీజీ సంఘం సభ్యత్వాల నమోదును వేగవంతం చేసి సమస్యల పరిష్కారం కోసం కీలక బాధ్యత వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మహేష్, హెచ్ఎంలే మానోరంజిని, నాగరత్నమ్మ, లక్ష్మిప్రసన్న, రాంరెడ్డి, మహేష్, రమేష్‌లు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ

నారాయణపేట: జాతీయ లోక్ అదాలత్ ద్వారా సత్వరం న్యాయం అందుతుందని.. కక్షిదారులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ అన్నారు. శ శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కోఆర్డినేషన్ సమావేశంలో జడ్జి మాట్లాడారు. సెప్టెంబర్ 14న (శనివారం) జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పోలీస్ అధికారులకు తెలిపారు. తమ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కారం పొందేలా చూడమని పోలీస్ అధికారులకు తెలియజేశారు. కోర్టులో ఇదివరకు పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలోని 14 పోలీస్ స్టేషన్ పరిధిలో పెండింగ్లో ఉన్న కేసులను అడిగి తెలుసుకున్నారు. వాటిని ఈ లోక్ అదాలత్ లో త్వరగా క్లియర్ చేయాలని ఆదేశించారు. 6500 కేసులు పరిష్కారమే లక్ష్యమన్నారు. ఎస్పీ యోగేష్‌గౌతమ్ మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో లక్ష్యం మేరకు రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో న్యాయమూర్తులు జి శ్రీనివాస్, మహమ్మద్ ఉమర్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ నాగేశ్వరి, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ సురేష్ కుమార్, బాలప్ప, డిఎస్పీ లింగయ్య పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్

కోస్గి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్ సూచించారు. ఈ మేరకు శనివారం గుండుమాల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగుల కోసం ఏర్పాటు చేసిన వసతులు, ఆస్పత్రి సిబ్బంది, వైద్యుల హాజరు, మందులకు సంబందించిన రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను అడిగి వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో శుభ్రతను పాటించి రోగులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సాధారణ కాన్పులు, వస్తున్న రోగులు, ఉప కేంద్రాలు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారి కిష్టమ్మ, స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బంది ఉన్నారు.

డ్రైవింగ్ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలి

నారాయణపేట: జిల్లా పోలీస్ స్టేషన్లలో పెట్రో కార్ విధులు నిర్వర్తించే వాహన డ్రైవర్లు డ్రైవింగ్ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సీఐ శివశంకర్ సూచించారు. ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు శనివారం ఎస్పీ కార్యాలయంలోని ట్రైనింగ్ సెంటర్‌లో జిల్లాలోని పోలీస్ మోటార్ వాహన డ్రైవర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ రాత్రి సమయాల్లో నిర్విరామంగా పెట్రోలింగ్ నిర్వహిస్తూ నేరస్తులపై నిఘా ఉంచాలని, ఎమర్జెన్సీ సమయంలో పైఅధికారులకు వాహనాన్ని అందుబాటులో ఉండాలని, మత్తుపదార్థాలు సేవించి వాహనాన్ని నడపరాదని హెచ్చరించారు. పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో ఉన్న మోటార్ వాహనాల మెకానిజంపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. పోలీసు మోటార్ వాహన డ్రైవర్లు, కంట్రోల్ రూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఒకే గ్రామంలో ఇద్దరి బలవన్మరణం


దండు అమృత (ఫైల్)


పరశురాములు (ఫైల్)

తెలకపల్లి: మండలంలోని గౌరారం గ్రామంలో శనివారం మేడెపు పరశురాములు (36), దండు అమృత (41) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి చెందిన దండు అమృతను కల్వకుర్తి మండలం రఘుపతిపేటకు చెందిన ఓ వ్యక్తికి ఇచ్చి వివాహం జరిపించారు. కాగా ఆమె భర్త నుంచి విడాకులు తీసుకొని తల్లితోనే గౌరారంలో ఉంటూ జీవనం సాగించేది. ఆమె గ్రామానికి చెందిన పరశురాములుతో చనువుగా ఉండటంతో ఆయన కుటుంబంలో కలహాలు ప్రారంభమయ్యాయి. ఇటీవల పరశురాములు భార్య అతడితో గొడవపడి పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో మనస్తాపానికి గురైన పరశురాములు శుక్రవారం రాత్రి 10.30 సమయంలో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న అమృత శనివారం ఉదయం తన ఇంట్లో ఉరేసుకొని మృతిచెందింది. పరశురాములుకు తల్లి, భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పరశురాములు భార్య రజిత, అమృత తల్లి అంజనమ్మ ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసుకొని రెండు మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

కోస్గి: భార్యాభర్తల మధ్య చిన్నపాటి గొడవ వల్ల మనస్థాపానికి గురైన వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పోలేపల్లి గ్రామానికి చెందిన మహేష్‌కు కర్ణాటక రాష్ట్రానికి చెందిన అంబిక(24)తో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వారికి మూడేళ్ల కూతురు ఉండగా, ప్రస్తుతం అంబిక కడుపుతో ఉంది. మందులు వేసుకునే విషయంలో భార్యాభర్తల మధ్య అప్పుడప్పుడు చిన్నపాటి గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో శనివారం ఉదయం మరోమారు మందుల విషయంలో గొడవ చోటు చేసుకుంది. దీంతో మనస్థాపానికి గురైన అంబిక(24) ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సమాచారం అందుకున్న పోలీసులు ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతానికి గురై మహిళ మృతి


రాజేశ్వరి (ఫైల్)

తెలకపల్లి: విద్యుదాఘాతానికి గురై మహిళ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని పెద్దపల్లి చెందిన శతమోని రాజేశ్వరి (26) శనివారం మధ్యాహ్నం పొలంలో గేదెలను, మేకలను మేపుతుండగా మేకలు పక్క పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లాయి. వాటిని అక్కడి నుంచి తరలించడానికి రాజేశ్వరి వెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ కాలికి తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నీటి సంపులో పడి బాలుడు..

నాగర్‌కర్నూల్ క్రైం: నీటి సంపులో పడి మూడేళ్ల బాలుడు మృతిచెందిన ఘటన తిమ్మాజిపేట మండలం పోతిరెడ్డిపల్లిలో తీవ్ర విషాదం రేపింది. స్థానికుల వివరాల మేరకు.. పోతిరెడ్డిపల్లికి చెందిన అల్లీసాబు కూతురు ఫాతిమా ఇటీవల తన భర్త, కుమారుడు అమీర్ (3)తో కలిసి తల్లిగారింటికి వచ్చింది. శనివారం అమీర్‌ను ఇంటి వద్ద ఉంచి, వైద్య పరీక్షల నిమిత్తం తల్లిదండ్రులు జడ్చర్లకు వెళ్లారు. ఈక్రమంలో ఇంటి ఆవరణలో బాలుడు ఆడుకుంటూ నీటి సంపులో పడ్డాడు. కొంత సేపటి తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు బాలుడిని సంపులో నుంచి బయటికి తీసి స్థానిక ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. బాలుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

3.10 లక్షల ఇన్‌ఫ్లో


జూరాల ప్రాజెక్టు వద్ద 44 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద నీరు

- జూరాల 44 క్రస్టు గేట్ల ఎత్తివేత..
- దిగువకు 3,13,619 క్యూసెక్కులు విడుదల

ధరూర్/ దోమలపెంట/ ఆత్మకూర్: మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రియదర్శిని జూరాలకు వరద భారీగా పెరుగుతోంది. శనివారం ప్రాజెక్టుకు 3,10,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 44 క్రస్టు గేట్లను ఎత్తి గేట్ల ద్వారా 2,91,384 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి ద్వారా 18,471, ఆవిరి రూపంలో 41, కుడి కాల్వ ద్వారా 453, ఎడమ కాల్వకు 820, నెట్టెంపాడుకు 750, భీమా లిఫ్టు–1కు 1,300, భీమా లిఫ్టు–2కు 750, సమాంతర కాల్వకు 400 క్యూసెక్కులు కలిపి మొత్తం ప్రాజెక్టు నుంచి 3,13,619 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.740 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

■ ఎగువనున్న ఆల్మట్టి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు 2,18,230 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. ప్రాజెక్టు నుంచి 3 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 123.081 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 76.698 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టుకు 3 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. దీంతో ప్రాజెక్టు వద్ద 25 గేట్లను ఎత్తి 3,00,064 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 33.313 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 25.164 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

5 యూనిట్లలో విద్యుదుత్పత్తి..

జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి కొనసాగుతుంది. జూరాలకు భారీ స్థాయిలో వరద వస్తుండటంతో పూర్తిస్థాయిలో చేపట్టలేకపోతున్నామని జెన్‌కో ఎస్‌ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ తెలిపారు. ఈ క్రమంలో ఎగువలో మాత్రమే 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టామని వివరించారు.

శ్రీశైలంలో 867.0 అడుగులు..

శ్రీశైలం జలాశయంలో రోజురోజుకూ నీటిమట్టం పెరుగుతుంది. శనివారం సాయంత్రం వరకు 867.0 అడుగుల వద్ద 130.0724 టీఎంసీల నీరు నిల్వ కొనసాగుతోంది. జూరాల ఆనకట్ట గేట్లు, విద్యుదుత్పత్తి చేస్తూ 3,09,885 క్యూసెక్కుల నీటిని శ్రీశైలానికి వదులుతున్నారు. అలాగే సుంకేసుల నుంచి 99,736 క్యూసెక్కులు కలిపి మొత్తం 4,09,621 క్యూసెక్కుల ప్రవాహం వస్తుంది. దీంతో భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో కుడిగట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 18,480 క్యూసెక్కుల నీటిని దిగువన నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు.

తుంగభద్రకు పెరిగిన వరద ఉధృతి

శాంతినగర్: కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద శనివారం వరద ఉధృతి మరింత పెరిగింది. శుక్రవారం సాయంత్రం 12.2 అడుగులు ఉండగా.. శనివారం ఉదయం 12.5 అడుగులు, సాయంత్రానికి 13.3 అడుగులకు చేరింది. సుంకేసుల బ్యారేజీ వైపు తుంగభద్రమ్మ పరవళ్లు తొక్కుతూ పర్యాటకులను కనువిందు చేస్తోంది. ఇదిలా ఉండగా ఆర్డీఎస్ హెడ్‌వర్క్స్ వద్ద కాల్వకు నీటి విడుదల కొనసాగుతోంది. శనివారం ఉదయం రాష్ట్ర సరిహద్దులోని సింధనూర్ డిస్ట్రిబ్యూటరీ 12 వద్దకు నీరు చేరింది.

సుంకేసులకు లక్ష క్యూసెక్కులు..

రాజోళి: మండల కేంద్రం శివారులో ఉన్న సుంకేసుల జలాశయానికి భారీగా వరద వచ్చి చేరుతోంది. ఎగువన ఉన్న ప్రాజెక్టులు నిండటంతో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. డ్యాం పూర్తిస్థాయి నీటిమట్టం 1.235 టీఎంసీలు ఉండగా.. ఎగువ నుంచి శనివారం ఉదయానికి 1,02,100 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. దీంతో 28 గేట్లు తెరిచి 99,736 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న శ్రీశైలం జలాశయానికి, 1,540 క్యూసెక్కులు కేసీ కెనాల్‌కు విడుదల చేసినట్లు జేఈ రాజు తెలిపారు.


సుంకేసుల జలాశయం నుంచి దిగువకు వెళ్తున్న వరద

గోరింటా పండింది


అచ్చంపేటలో నిర్వహించిన గోరింటాకు సంబరంలో పాల్గొన్న మహిళా రెడ్డి సేవాసమితి సభ్యులు (ఫైల్)

- ఆషాఢ మాసంలో ఉత్సాహంగా మెహందీ వేడుకలు
- అతివలకు అందం.. ఆరోగ్యం
- భవిష్యత్ తరాలకు తెలియజేసేందుకంటున్న మహిళలు

అచ్చంపేట: ఆషాఢమాసం అనగానే అతివలకు గోరింటాకు గుర్తుకు వస్తుంది. ఈమాసం ముగిసేలోపు ఒక్క రోజైనా గోరింటాకు పెట్టుకోవాలని పెద్దలు చెబుతారు. అతివలు అరచేతులకు పెట్టుకొని మురిసిపోతుంటారు. పెళ్లిగాని అమ్మాయిల చేతికి గోరింటాకు ఎర్రగా పండితే, మంచి భర్త దొరుకుతాడని.. పెళ్లయిన మహిళలకు మందారంలా మెరిస్తే, భర్తమీద ప్రేమను తెలియజేస్తుందని నమ్మకం. తొలకరి వర్షపు జల్లులలో ఆషాఢ మాసం ప్రారంభమవుతుంది. ఈ మాసంలో గోరింటాకు సంబరానికి పెట్టింది పేరు. అంతే కాదు.. ఔషధ గుణాలు గోరింటాకులో మెండు. ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో సంబరంగా చేసుకునే పండుగ. ఇటీవలి కాలంలో మహిళలందరూ ఒకచోట చేరి మెహందీ వేడుకలు నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. కిట్టీ పార్టీల్లోనూ ఆషాఢ మెహందీ పేరిట కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అచ్చంపేటలో మహిళా రెడ్డి సేవా సమితి, రక్షిత మహిళా సొసైటీ, మధురానగర్ కాలనీలోని కిట్టీ సభ్యులు ఆషాఢం సందర్భంగా గోరింటాకు సంబరాలు నిర్వహించారు. అందరూ ఒకచోట చేరి గోరింటాకును తయారు చేసి, చేతులకు పెట్టుకుని సందడి చేశారు.

■ గోరింటాకు గౌరీదేవికి ప్రతీకగా భావిస్తారు. అందులో అనేక ఔషధ గుణాలుంటాయి. ఆషాఢంలో ఏదో ఒకరోజు గోరింటాకు పెట్టుకునేందుకు మహిళలు మక్కువ చూపుతారు. నేటి ఆధునిక కాలంలో గోరింటాకు పేరుతో కోన్లు, పేస్టులు వస్తున్నాయి. అవి రంగును, అందాన్ని ఇస్తాయి తప్ప.. ఔషధ గుణాలు ఉండవు.

చర్మవ్యాధులు రాకుండా..

అందంతో పాటు వైజ్ఞానికంగా ఆరోగ్యాన్ని అందించేది గోరింటాకు. వర్షాకాలంలో గోరింటాకు పెట్టుకుంటే చర్మవ్యాధుల బారి నుంచి రక్షించుకోవచ్చు. ఆషాఢంలో వర్షాలు ఎక్కువగా కురవడంతో పంట పొలాలు బురదమయమై క్రిమికీటకాలు పెరుగుతాయి. మహిళలు పొలంలో వరినాట్లు వేయడం వల్ల చేతులు, కాళ్లకు బురద అంటుకుంటుంది. ఈమాసంలో మైదాకు పెట్టుకుంటే చర్మవ్యాధులు రాకుండా కాపాడుతుందని వైద్యులు చెబుతున్నారు.

ప్రయోజనాలు..

మైదాకు చేతి వేళ్లకు పెట్టుకోవడం వల్ల గోళ్లు పెసలుబారి పోకుండా కాపాడుతుంది. ఆకులే కాకుండా పూలు వేర్లు, బెరడు, విత్తనాలు కూడా ఔషధయుక్తలే. వీటితో శరీరంలో అలర్జీలను దూరం చేసుకోవచ్చు. బోధకాళ్ల వ్యాధి, ఏనుగు కాలు (లింపాటిక్ ఫైలేరియాసిస్) దరి చేరదు. అటలమ్మ మచ్చల నివారణకు గోరింటాకు మంచి ఫలితాలన్నిస్తుంది. నెలకోసారి గోరింటాకు ముద్దను తలకు ప్యాక్ వేసుకుంటే, జుట్టు బలపడి రాలదు. గోరింటాకు పొడితో కాచిన నూనెను వాడటం చిట్కా వైద్యంలో ఒకటి. గోరింటాకు ఒంట్లో వేడిని తగ్గిస్తుంది. ఇదీ శరీరాన్ని తాకడం వల్ల అందులోని లాసోన్ అనే సహజమైన రసాయనంతో ఎరుపు రంగు ఏర్పడుతుంది. కోన్లలో కృత్రిమంగా ఎరుపు రంగు కలిగించే రసాయనాలు కలపడం వల్ల ఆరోగ్యం మాటేలా ఉన్నా.. కొన్ని అలర్జీలు వచ్చే ప్రమాదం లేకపోలేదు.

సహజసిద్ధ మైదాకుతో ఆరోగ్యం



ప్రతి ఆషాఢంలో గోరింటాకు పెట్టుకుంటాం. ప్రకృతి మనకు అందించిన గోరింటాకు పెట్టుకోవడం వల్ల చేతులకు అందం, ఆరోగ్యం కలుగుతుంది. కొత్తగా పెళ్లయినా యువతులు ఆషాఢంలో తల్లిగారింటికి వచ్చి గోరింటాకు పెట్టుకొని మురిసిపోవడం ఆనవాయితీ. కోన్లకు బదులు మైదాకు వాడటం ఆరోగ్యానికి మంచిది.

– జి.కమిత, మహిళా రెడ్డి సేవాసమితి అధ్యక్షురాలు, అచ్చంపేట

ఇష్టంగా వేడుక చేసుకుంటాం..



మెహందీ అంటే ఇష్టపడని మహిళలు ఉండరు. పసిపిల్లల నుంచి మొదలుకొని వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ మైదాకును ఇష్టపడతారు. ప్రస్తుత కాలంలో కోన్లు వచ్చినా.. ఆషాఢంలో మాత్రం గోరింటాకును నూరి చేతులకు పెట్టుకుంటారు. ఆషాఢంలో ఇష్టమైన వేడుకగా నిర్వహించుకుంటాం. గోరింటాకు మన సంప్రదాయంలో భాగంగా భావించాలి. – మాధవిలత, రక్షిత మహిళా సొసైటీ ప్రధాన కార్యదర్శి, అచ్చంపేట

సంప్రదాయ ఔషధం..



మైదాకు చేతులకు పెట్టుకోవడం సంప్రదాయంతో పాటు మంచి ఔషధం. ఇది పూర్వం నుంచి వస్తున్న ఆచారం. శుభకార్యాలకు మహిళలు తప్పక మైదాకు పెట్టుకుంటున్నారు. నేడు కోన్లు వచ్చాయి. మంచి కోన్లలో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్‌లు ఉండవు. ఆషాఢ మాసంలో గోరింటాకు సంబరాలు జరుపుకోవడం ఆనందంగా ఉంది.

– అంజలి, అచ్చంపేట

మంగళకరం..



శివుడి సతి గౌరి పేరుమీద చేసుకునే పండగ. గోరింటాకు అంటే గౌరి ఇంటి ఆకు కాబట్టి మహిళలు మంగళకరమైనదిగా భావిస్తారు. ఊహ తెలిసిన నాటి నుంచి ప్రతి ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకుంటున్నా. ఆషాఢం వచ్చిందంటే మాఇంట్లో మైదాకు పండగ వాతావరణం ఉంటుంది.

– వంగా ఉమాదేవి, అచ్చంపేట


రక్షిత మహిళా సొసైటీ ఆధ్వర్యంలో..

గ్రానైట్ లారీ పట్టివేత

- రూ.80 వేల జరిమానా విధించిన జీఎస్టీ అధికారులు


జడ్చర్లలో గ్రానైట్ లారీ వద్ద ఏసీటీఓ వెంకట్రామారెడ్డి, పోలీసులు

జడ్చర్ల: పట్టణంలో అక్రమంగా అన్‌లోడ్ చేస్తున్న గ్రానైట్ లారీని వాణిజ్య పన్నులశాఖ అధికారులు పట్టుకొని జరిమానా విధించిన ఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జడ్చర్ల–మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిని అనుసరించి ఉన్న మార్బుల్ దుకాణంలో లారీలో తీసుకొచ్చిన గ్రానైట్ బండలను దించుతుండగా ఏసీటీఓ వెంకట్రామారెడ్డి తనిఖీ చేశారు. దుకాణ యజమాని ఆన్‌లైన్‌లో జీఎస్టీ చెల్లించలేదని ధ్రువీకరించుకున్నారు. వరంగల్‌కు వెళ్లాల్సిన లోడ్‌ను ఇక్కడ దించుతున్నట్లు గుర్తించి వెంటనే వాణిజ్య పన్నుల అసిస్టెంట్ కమిషనర్ వెంకటయ్యకు సమాచారం అందించారు. అదేవిధంగా డయల్ 100కు ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగి విచారించారు. లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించేందుకు యత్నిస్తుండగా ఆన్‌లైన్‌లో జీఎస్టీ చెల్లించడంతో విడుదల చేశారు. నిబంధనల ప్రకారం లోడ్ విలువను అంచనా వేసి 18 శాతం జీఎస్టీతో పాటు మరో 18 శాతం జరిమానా విధించగా మొత్తం రూ.80 వేలు చెల్లించినట్లు అసిస్టెంట్ కమిషనర్ వెంకటయ్య తెలిపారు. జీఎస్టీ చెల్లించని వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కాగా బెంగళూరు నుంచి వరంగల్‌కు వెళ్లాల్సిన లోడ్‌ను ఇక్కడ దించడంలో ఆంతర్యమేమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గ్రానైట్ దుకాణం జీరోగా నిర్వహిస్తున్నారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

తాడూరు: మండలంలోని మేడిపూర్‌కు చెందిన విద్యార్థి వంశీ (20) చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు. వారి వివరాల మేరకు.. విద్యార్థి వంశీ నాగర్‌కర్నూల్‌లోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాల్లో సరైన మార్కులు రాకపోవడంతో మనస్తాపానికి గురైన అతడు.. ఈ నెల 24న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. విద్యార్థి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

ఎల్కిచర్లలో మహిళ..

భూత్పూర్: చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని ఎల్కిచర్లలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఎల్కిచర్లకు చెందిన నాగమ్మ (45) శుక్రవారం రాత్రి 9 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్తుండగా ఇంటి ముందున్న డ్రెయినేజీలో ప్రమాదవశాత్తు పడిపోయింది. దీంతో తలకు గాయాలు కావడంతో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఆమె మృతి చెందినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఆమె కుమారుడు జంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

‘పాలమూరు’ జాతీయ హోదాకు ఉద్యమిద్దాం

- బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం
- సీపీఐ నేత చాడ వెంకట్‌రెడ్డి


మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: దశాబ్దాలుగా తీవ్ర అన్యాయానికి గురైన పాలమూరు ప్రజల బతుకులు మారాలంటే కేంద్ర ప్రభుత్వం తక్షణమే పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని, కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి కోరారు. శనివారం మహబూబ్‌నగర్‌లోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన సీపీఐ ఉమ్మడి జిల్లా రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మోదీ ప్రభుత్వం తన కుర్చీని కాపాడుకునేందుకు ఎన్డీఏ రాష్ట్రాలకు తప్పా ఇండియా కూటమి అధికారంలో ఉన్న రాష్ట్రాలకు నిధులు కేటాయించకుండా వివక్ష చూపిందని ఆరోపించారు. రాష్ట్రంలో కేసీఆర్ నియంత పాలనను పారద్రోలినా.. ఆ పార్టీ నాయకుల బుద్ధి ఇంకా మారడం లేదని, ఇప్పటికీ వారే అధికారంలో ఉన్నట్లు పగటి కలలు కనడం హాస్యాస్పదమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏ ఒక్క పైసా వృథా కాకుండా ప్రజా సంక్షేమానికి ఖర్చు చేయాలని కోరారు. ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డా. ఖాసీం మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ వ్యవస్థను సమూలంగా మార్చేందుకు కుట్ర జరుగుతోందని, కులం, మతం, జాతి, నయా జాతీయవాదం చెప్పిస్తూ రాజకీయ పబ్బం గడుపుకొనేందుకు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు ఎండీ యూసుఫ్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ, జిల్లా కార్యదర్శి బాలకిషన్, వనపర్తి జిల్లా కార్యదర్శి విజయరాములు, గద్వాల జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, నారాయణపేట జిల్లా కార్యదర్శి కొండన్న, నాయకులు ఆనంద్, వెంకటయ్య, శ్రీనివాసులు, రాము, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు పార్టీలు ఏకం కావాలి..

దేశ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కమ్యూనిస్టు పార్టీలన్నీ ఏకం కావాల్సిన అవసరం ఉందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ శతాబ్ది వార్షికోత్సవాల్లో కమ్యూనిస్టు పార్టీల విలీన ప్రక్రియ సాకారమయ్యే అవకాశం ఉందన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో ప్రజలు ఇబ్బందుల్లోకి నెట్టబడుతున్నారని.. కమ్యూనిస్టు పార్టీలు ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో జరిగిన అన్యాయంపై ఈ ప్రాంత ఎంపీలు నిలదీయాలని కోరారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్‌లో పాలమూరుకు మూడోస్థానం



స్టేషన్ మహబూబ్‌నగర్: వరంగల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్–17 బ్యాడ్మింటన్ టోర్నీ శనివారం ముగిసింది. డబుల్స్ విభాగంలో జిల్లా క్రీడాకారులు ఎస్‌జే జోయెల్, సంతోష్ మూడోస్థానంలో నిలిచారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను మహబూబ్‌నగర్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ (ఎండీబీఏ) అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంసుందర్‌గౌడ్, ఎల్.రవికుమార్, సంయుక్త కార్యదర్శి మహ్మద్ అలీ, సతీష్ జోసెఫ్ అభినందించారు.

చోరీ కేసులో వ్యక్తి రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి, చిత్రంలో నిందితుడు

కొత్తకోట రూరల్: పట్టణంలోని సెల్‌ఫోన్ షాపులో చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ మంజునాథరెడ్డి తెలిపారు. పట్టణ కేంద్రానికి చెందిన బాలకృష్ణ రామాలయం ఎదుగా సెల్‌ఫోన్ దుకాణం నిర్వహిస్తున్నాడు. షాపులో ఇది వరకు ఉన్న కౌంటర్ తాళం పోగొట్టుకోవడంతో కొత్త కౌంటర్‌ను చేయించుకున్నాడు. పాత కౌంటర్‌ను మూడు రోజుల క్రితం బాలకృష్ణ బావమరిది రవి స్వగ్రామమైన అమడబాకులకు తరలించేందుకు గణేష్ అనే వ్యక్తికి చెందిన ఆటోను పిలిపించి పంపించారు. పాత కౌంటర్‌లో డబ్బులు ఉన్న విషయం బాలకృష్ణకు, అతని భార్య మానస, ఆటో డ్రైవర్ గణేష్‌కు మాత్రమే తెలుసు. శుక్రవారం మధ్యాహ్నం అమడబాకుల రవి ఇంటి ముందు ఉన్న పాత కౌంటర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు బద్దలు కొడుతుండటాన్ని చూసిన రవి భార్య ప్రియాంక గమనించి కేకలు వేయడంతో కౌంటర్‌లో ఉన్న రూ.71వేల నగదును తీసుకుని పరారయ్యారు. ఈవిషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో రవి ఫిర్యాదు చేయగా ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి క్లూస్ టీంను పిలిపించి వేలిముద్రలను సేకరించారు. అనుమానితుడైన గణేష్‌ను కొత్తూర్ రోడ్డులో పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆ పాఠశాలలో పూరిగుడిసే.. వంటగది



ఎన్ని ప్రభుత్వాలు మారినా.. ఆ పాఠశాలలో వంటగది మాత్రం మారడం లేదు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తయారీకి పూరిగుడిసే దిక్కయ్యింది. ఎండ కొట్టినా.. వాన కురిసినా గుడిసెలోనే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తయారవుతోంది. వివరాల్లోకి వెళ్తే.. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం జౌళ్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో 20 ఏళ్లుగా పూరిగుడిసెలోనే వంటగది కొనసాగుతోంది. పాఠశాలలో 60 మందికి పైగా విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. పాఠశాల తనిఖీకి అధికారులు వచ్చినప్పుడు కేవలం మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలిస్తారు తప్ప.. వంటచేసే గుడిసె వైపు చూడటం లేదని వంట ఏజెన్సీ నిర్వాహకురాలు వాపోయారు. – మక్తల్